క్లుప్తంగా

అయ్యప్ప పడిపూజ


ఇరుముడి పూజలో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ స్వాములు కోదండరామస్వామి ఆలయంలో గురుస్వాములు పడిపూజ చేశారు. అయ్యప్పస్వామి కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం వేద పండితుడు, గురుస్వామి శాస్త్రుల వామనశర్మ ఇరుముడి పూజ చేపట్టి శబరిమల యాత్ర బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఇసుగారి శ్రీనివాస్ అన్నదానం చేశారు.

విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

కౌడిపల్లి(నర్సాపూర్): జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడీ అభినందించారు. మంగళవారం ఈ సందర్భంగా మండలంలోని తునికి ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, పీడీ రాజన్న మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అండర్ 14ఖోఖో పోటీల్లో తెలంగాణ అసోసియేషన్ టీం తరఫున తునికి ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులు వంశీ, కిరణ్ పాల్గొని జాతీయ పోటీల్లో తృతీయ స్థానం వచ్చినట్లు తెలిపారు.

ఓటరు నమోదు చేసుకోవాలి

చిన్నశంకరంపేట(మెదక్): జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువకులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని చిన్నశంకరంపేట ఉప తహసీల్దార్ మహేందర్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో బీఎల్ఓలకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. శిక్షకుడు వరుణప్రసాద్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 3.79 లక్షలు


చాకరిమెట్లలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీని మంగళవారం ఆలయ సిబ్బంది, భక్తుల సమక్షంలో లెక్కించారు. పర్యవేక్షణ అధికారిగా శశిధర్‌గుప్తాని నియమించారు. మూడు నెలలకు సంబంధించి ఆలయ హుండీ ఆదాయం రూ.3 లక్షల 79 వేల 546 వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ఎంపీటీసీ దశరథ్, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ, గ్రామస్తులు, నారాయణరావు, హర్షనాయక్ తదితరులు ఉన్నారు.

నేడు డైట్‌సెట్‌కు ధ్రువపత్రాల పరిశీలన

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్ డైట్ కళాశాలలో బుధవారం డైట్‌సెట్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలిస్తారని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అనివార్య కారణాలతో డైట్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులు తమ ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, ఇంటర్, టెన్త్ మెమోలు తదితర సర్టిఫికేట్లతో హాజరు కావాలని తెలిపారు. హాజరైన విద్యార్థులకు ఈ నెల 22 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ పెట్టుకున్న వారికి 30న సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మనోహరాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌గా కౌశిక

మనోహరాబాద్(తూప్రాన్): మండల డిప్యూటీ తహసీల్దార్‌గా కౌశిక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా నార్సింగి తహసీల్దార్ కార్యాలయంలో మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన కౌశిక బదిలీపై మనోహరాబాద్‌కు వచ్చారు.


అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు


శిథిల పాఠశాల భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ

శిథిల భవనంలో అంగన్‌వాడీ

- ప్రమాదం జరిగితే బాధ్యులెవరు..?
- అసంపూర్తిగా భవన నిర్మాణ పనులు

శివ్వంపేట(నర్సాపూర్): శిథిల భవనంలో అంగన్‌వాడీ కొనసాగుతోంది. ఈ పాఠశాల భవనంలో అంగన్‌వాడీ నిర్వహిస్తుండడంతో ఇందులో ఉంటున్న చిన్నారులకు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీకి సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తిగా భవనం

గ్రామ పరిధిలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి 10 ఏళ్ల క్రితం నాబార్డు ద్వారా రూ.4 లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించి నిధులు విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభించినప్పటికీ బేస్మెంట్ లెవల్‌లోనే నిలిచిపోయాయి. భవన


పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం శిథిలావస్థ భవనంలో ఏ ప్రమాదం జరగకముందే అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

ఉన్నత అధికారులకు నివేదిస్తా

అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ఉన్నత అధికారులకు నివేదిస్తా.

– భాస్కర్‌రావు, పీఆర్, ఏఈ

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ప్రస్తుతం శిథిలావస్థలో కొనసాగుతున్న అంగన్‌వాడీని ఇతర చోటికి మార్చేందుకు చర్యలు తీసుకుంటాం. భవన నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ఎమ్మెల్యే సునీతారెడ్డి దృష్టికి తీసుకెళ్తా.

– రవినాయక్, సర్పంచ్

వీరహనుమాన్ దేవాలయంలో సంప్రోక్షణ


హోమం నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలో కొలువైన వీరహనుమాన్ దేవాలయంలో మంగళవారం సంప్రోక్షణ కార్యక్రమాలు చేశారు. గ్రామ సర్పంచ్ కీర్తనహన్మంత్‌రావు ఆధ్వర్యంలో గ్రామ పురోహితుడు శాస్త్రుల రఘుశర్మ ప్రత్యేక పూజలతో పాటు పుణ్యావచనం, వాస్తు, నవగ్రహాల పూజ, అభిషేకం, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, గ్రామస్తులు ముత్యాలు, సునందరెడ్డి, యాదిరెడ్డి, కల్లూరి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కల్లూరి రాజు, తదితరులు ఉన్నారు.

ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి


కౌడిపల్లిలో గణిత దినోత్సవం

ఎంఈఓ బుచ్చానాయక్

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం, గణితం తప్పనిసరిగా రావాలని ఎంఈఓ బుచ్చానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని తునికి ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతి, విద్యాబోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం, గణితాలు తప్పనిసరిగా రావాలని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమైయ్యేలా బోధించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేశ్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

గణిత దినోత్సవం..

మండల కేంద్రం కౌడిపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గణిత మేళాను పరిశీలించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలని చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ సిబ్బంది లేకపోవడంతో రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌కి మరమ్మతులు చేశారు. మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామ వ్యవసాయ బోరుబావులకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేసేందుకు లైన్‌మెన్ అందుబాటులో లేకపోవడంతో మంగళవారం రైతులు మరమ్మతులు పనులు నిర్వహించారు. ఈ విషయం ట్రాన్స్ కో ఏఈ దుర్గా ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా, లైన్‌మెన్ స్వామి వేరు చోటికి వెళ్లడంతో అక్కడ హెల్పర్‌ని ఉంచినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి


లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన కొండాపూర్ గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు నూకల రాముయాదవ్, నర్సింగరావు మంగళవారం హైదరాబాద్‌లోని లోకాయుక్తాలో ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండాపూర్ గ్రామంలో సర్వే నంబర్‌లోని 144 లోని 11 ఎకరాల 37 గుంటల భూమిని అప్పటి రెవెన్యూ అధికారులు రియాల్టర్లతో కలిసి ఇతరుల పేరున రిజిష్టర్ చేసినట్లు ఆరోపించారు. ఈ విషయమై అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకునే నాథులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని, ఈ నెల 13న ప్రగతిభవన్‌లో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదే విషయంలో మంగళవారం లోకాయుక్తాలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

వెల్దుర్తి(తూప్రాన్): చిన్న, చిన్న కారణాలతో గొడవపడి కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు ఈ నెల 30న మెదక్ కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్ వినియోగించుకోవాలని ఎస్ఐ మధుసూదన్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గొడవలతో విడిపోయి రాజీతో కలిసి ఉన్న భార్యభర్తలు, భూ తగాదాలు, ఇతర కారణాలతో పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు రాజీ కు దుర్చుకున్నట్లయితే కేసుల ఉపసంహరణకు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించవచ్చన్నారు. అంతేకాకుండా ఎవరైనా రాజీ కాకుండా నేరము ఒప్పుకొని జరిమానా కట్టడం వలన కూడా కేసు నుంచి విముక్తి పొందవచ్చన్నారు.

నేటి మండల సర్వసభ్య సమావేశం వాయిదా

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీరామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకొని 20న జరగాల్సిన సమావేశానికి వాయిదా వేస్తున్నట్లు, మళ్లీ ఎప్పుడు నిర్వహించాలనే దానిని ప్రకటిస్తామని వివరించారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గమనించాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహ పరికరాలు దగ్ధం

శివ్వంపేట(నర్సాపూర్): షార్ట్ సర్క్యూట్‌తో గృహ పరికరాలు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని నవాబుపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి స్వామి రేకుల నివాసంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. గుర్తించిన కుటుంబ సభ్యులు మంటలు ఆర్పివేసినా.. వంట సామగ్రి, ఇతర వస్తువులు, గృహ పరకరాల దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సర్పంచ్ అశోక్‌రెడ్డి కోరారు.

ముదిరాజుల ఐక్యత చాటాలి

పెద్దశంకరంపేట(మెదక్): ముదిరాజులు ఐకమత్యంగా ఉండాలని మండల ముదిరాజుల సంఘం అధ్యక్షుడు పున్నయ్య అన్నారు. మంగళవారం పేటలో ముదిరాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్వి కృష్ణస్వామి 56వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వతంత్ర సమరయోధుడు, హైదరాబాద్ మొదటి మేయర్ కృష్ణస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం బాధ్యులు జోడు రవీందర్, శ్రావణ్, అంజయ్య, సాయిరాం, సంగమేశ్వర్, మాణిక్యం తదితరులున్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా


నర్సాపూర్ మున్సిపల్ సమావేశంలో చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్

నర్సాపూర్: మెజారిటీ కౌన్సిలర్లు రానందున మంగళవారం ఏర్పాటు చేసిన నర్సాపూర్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం వాయిదా వేశారు. మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభించారు. కౌన్సిలర్లు సురేశ్, రాజేందర్, ఎరుకల యాదగిరి, లత సమావేశంలో పాల్గొన్నారు. కాగా మెజారిటీ కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కానందున కౌన్సిలర్ల కోరిక మేరకు సమావేశం వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు.

అవిశ్వాసానికి నోటీసు ఇచ్చినందునే గైర్హాజరు..?

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం వ్యక్తం చేస్తూ ఇటీవల నోటీసు ఇచ్చినందునే మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి మెజారిటీ కౌన్సిలర్లు రాలేదని తెలిసింది. చైర్మన్ మురళీయాదవ్‌పై బీఆర్ఎస్‌కు చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు అవిశ్వాసం వ్యక్తం చేస్తూ ఈనెల 15న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు నోటీసు అందజేశారు. దీంతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లందరూ గైర్హాజరైనారని తెలిసింది.

కేంద్ర పథకాలపై అవగాహన


మాట్లాడుతున్న వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్


జాజితండాలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమేశ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై గ్రామీణ స్థాయిలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. మంగళవారం మండల కేంద్రం చిలప్‌చెడ్, చిట్కుల్ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు కేంద్రం అందిస్తున్న ఈజీఎస్, పీఎం కిసాన్ యోజన, పీఎం సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, ఉజ్వల గ్యాస్ పథకం తదితర పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీరెడ్డి, గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, తిరుపతి, మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, ఏఈఓ రమ్య, వైటర్నరీ అసిస్టెంట్ సురేశ్, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో రూ 5లక్షల ఉచిత వైద్యం

కౌడిపల్లి(నర్సాపూర్): ఆయుష్మాన్ భారత్‌తో రూ. 5లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమేశ్ తెలిపారు. మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మండలంలోని హరిచంద్‌తండా, జాజితండా పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై తండావాసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 5లక్షల వరకు వైద్య చికిత్స చేయించుకునే అవకాశం ఉందన్నారు. పల్లె దవాఖానాల్లో ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈసీ ప్రేంకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, ఏపీఎం సంగమేశ్వర్ సర్పంచ్ లక్ష్య, రమేశ్, తండావాసులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సవరణ


చిలప్‌చెడ్‌లో బీఎల్ఓలతో మాట్లాడుతున్న శిక్షకుడు హరికృష్ణ

కొల్చారం(నర్సాపూర్): రాబోయే స్థానిక సంస్థల, పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సవరణలు చేపట్టాలని తహసీల్దార్ గఫర్ మియా బీఎల్ఓలకు సూచించారు. మంగళవారం ఓటరు జాబితా సవరణపై మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులతో పాటు ఓటర్ కార్డుల్లో ఫొటో మార్పుకు అవకాశం కల్పించిందన్నారు. 2024 నాటికి జనవరి నెలాఖరు వరకు 18 ఏళ్ల యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఈ విషయాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి ఓటరు జాబితాను పక్కాగా సిద్ధం చేయాలని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్ రైతువేదికలో బీఎల్ఓలకు ఓటరు నమోదుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ముసాద్దీక్, శిక్షణ సిబ్బంది హరికృష్ణ, శ్రీనివాస్, పండరి మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పొప్పులు లేకుండా చూడాలన్నారు. జనవరి 1వ తేదీ 2024 వరకు 18 ఏళ్ల నిండిన యువతీ యువకులను ఓటరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. గ్రామంలో ఓటు హక్కుపై పూర్తిస్థాయి అవగాహన వచ్చేలా బీఎల్ఓలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ సూపర్‌వైజర్ వెంకటేశ్, ఆర్ఐ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం బారులు


శివ్వంపేటలో క్యూలైన్‌ని అదుపు చేస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): గ్యాస్ ఈకేవైసీ కోసం లబ్ధిదారులు బారులు తీరారు. మంగళవారం మండల కేంద్రం శివ్వంపేటలోని వెంకటరమణ భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈకేవైసీ చేయించుకునేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులను పోలీసులు అదుపు చేశారు. ఈకేవైసీ ఈ నెలఖరు కాదని అధికారులు చెప్తున్నా.. లబ్ధిదారులు పట్టించుకోవడం లేదు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు పూరిగుడిసె దహనమైన సంఘటన నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. శేరిపల్లి గ్రామానికి చెందిన చెప్యాల నర్సింలు గృహంలో వంట చేస్తుండగా.. నిప్పులు చెలరేగి గుడిసెకు నిప్పంటుకుంది. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయగా.. ఇరుగు పొరుగు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పారు. అప్పటికే ఇంట్లోని దుస్తులు, బియ్యం, గృహ పరికరాలు మంటలకు దహనం మయ్యాయని కుటుంబ సభ్యులు నర్సింలు, లక్ష్మి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ మల్లేశం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

◆ పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్టు సీడీపీఓ హేమాభార్గవి అన్నారు. మంగళవారం శివ్వంపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల అన్నప్రాసన, అభివృద్ధి, పత్రాల పరిశీలనతో పాటు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సంతోష, టీచర్లు కృష్ణవేణి, నవీన, ఏఎన్ఎం రేణుక, ఆశ కార్యకర్త అనూష తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త గులాం దస్తగిరి కుమారుడు నిసార్ మృతి చెందాడు.దీంతో మంగళవారం బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రోహిత్‌రావు రూ. 10 వేల ఆర్థిక సాయం పంపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు గౌస్, నరేంద్రగౌడ్, విఠలాక్షప్ప, కిషన్‌రెడ్డి ఉన్నారు.

◆ వాహనం ఢీకొని పాడిగేదె మృతి

తూప్రాన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని పాడిగేదే మృతి చెందిన సంఘటన నాగులపల్లి చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని తాతపాపన్‌పల్లి గ్రామానికి చెందిన ఎక్కాల్‌దేవ్ మల్లేశ్ పాడిగేదే(సుమారు రూ.80వేల విలువైనది) రహదారిపై నుంచి రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో పాడిగేదే అక్కడిక్కడే మృతి చెందింది. బాధితుడు పశువైద్యాధికారి లక్ష్మికి సమాచారం అందించడంతో ఆమె ఘటన స్థలానికి చేరుకొని గేదే పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం తన గేదెకు సకాలంలో బీమా ఇప్పించాలని కోరాడు.

◆ నూతన కమిటీ ఎన్నిక

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన అరుంధతీయ బంధుసేవా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఏమ్మార్పీఎస్ నాయకులు మురళీ తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన వర్గంటి అశోక్‌ను నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సదానంద్, కార్యదర్శిగా వేణుగోపాల్, క్యాషియర్‌గా పూర్ణస్వామి, సలహాదారులుగా అరుణ్, పవన్, రవి, సాయినాథ్, శేఖర్, ఆంజనేయులు, నాగేశ్ ఎన్నికయ్యారు. కుమార్, ధర్మేశ్, యాదగిరి, కృష్ణ, ఎన్. కృష్ణ, మధు, సాయి తదితరులున్నారు.

◆ అసత్యపు ఆరోపణలు ఖండిస్తున్నాం : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరప్ప

టేక్మాల్(మెదక్): అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఆయన సోదరుడు రాహుల్ కిరణ్‌పై భూమయ్య అనే వ్యక్తి దళితబంధుకోసం డబ్బులు ఇచ్చానని చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. భూమయ్య అనే వ్యక్తిగత ఏడాది నుంచే కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేఖంగా పని చేస్తున్నాడని ఆరోపించారు. రాజకీయ కుట్రలో భాగంగానే భూమయ్య, మరికొందరు కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. అతను చేస్తున్న ఆరోపణలు అన్ని అవాస్తవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అవినాష్, నాయకులు చింత రవి, నాయికోటి భాస్కర్, మహేందర్, సలీం, సిద్దన్న, పల్వంచ సర్పంచ్ శివకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, మాణెయ్య, దుర్గయ్య, సత్యాగౌడ్, గోవింద్ చారి, మల్లేశం, సలావుద్దీన్ తో పాటు తదితరులు ఉన్నారు.